గ్రేటర్‌లో కొనసాగుతున్న డబుల్ బెడ్‌రూం సంబురాలు

# నేడు 19,020 మందికి ఇండ్ల పంపిణీ

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 3వ విడుతలో ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం (నేడు) ప్రజాప్రతినిధులు పంపిణీ చేయనున్నారు. పేదలు ఎంతో గొప్పగా బతకాలి, సొంతింటి కలను నెరవేర్చాలనే సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు రూ.9,600 కోట్ల వ్యయంతో జీహెచ్ఎంసీ పరిధిలో ఎంతో విలువైన స్థలాల్లో ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. నిర్మించిన ఇండ్లను ఎంతో పారదర్శకంగా, రాజకీయ ప్రమేయం లేకుండా, పార్టీలకు అతీతంగా ర్యాండోమైజేషన్ పద్ధతిలో ఆన్‌లైన్ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మొదటి విడుతలో 11,700 మందికి, రెండో విడుతలో 13,200 మందికి ఇండ్లను మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల పంపిణీ చేసినట్లు వివరించారు. మూడో విడుతలో 36,884 మందిని ఎంపిక చేశామని.. సోమవారం 19,020 మందికి, 5వ తేదీన మిగిలినవారికి ఇండ్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తలసాని తెలిపారు.

### పంపిణీ ఇలా..

| నియోజకవర్గం/ప్రాంతం | లబ్ధిదారులు | పంపిణీ చేసే ప్రజాప్రతినిధి |
|---|---|---|
| కుత్బుల్లాపూర్/దుండిగల్ | 3142 | మంత్రి మహమూద్‌అలీ |
| చేవెళ్ల/శంకర్‌పల్లి | 1361 | మంత్రి మహేందర్‌రెడ్డి |
| మహేశ్వరం/మన్‌సాన్‌పల్లి | 2099 | మంత్రి సబితారెడ్డి |
| శేరిలింగంపల్లి/నలగండ్ల | 344 | డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ |
| రాజేంద్రనగర్/నార్సింగి | 356 | మేయర్ విజయలక్ష్మి |
| పటాన్‌చెరు/కొల్లూరు-2 | 6067 | మంత్రి హరీశ్‌రావు |
| మేడ్చల్/అహ్మద్‌గూడ | 1965 | మంత్రి మల్లారెడ్డి |
| మేడ్చల్/రాంపల్లి | 3214 | మంత్రి శ్రీనివాస్‌యాదవ్ |
| ఇబ్రహీంపట్నం/అబ్దుల్లాపూర్‌మెట్ | 472 | మంత్రి సబితారెడ్డి |

## కొడంగల్ యువతికి ఉత్తమ అవార్డు



డా.అరిగె సుజ్ఞానజ్యోతి మిథున్‌చక్రవర్తికి ఉత్తమ అవార్డును అందజేస్తున్న గవర్నర్ తమిళిసై

కొడంగల్, అక్టోబరు 1: పట్టణానికి చెందిన డా.అరిగె సుజ్ఞానజ్యోతి మిథున్‌చక్రవర్తికి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఉత్తమ అవార్డును గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అందజేశారు. హైదరాబాద్‌లోని కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఏసియా టుడే రీసెర్చ్ అండ్ మీడియా ఆర్గనైజింగ్ వారు ప్రైడ్ ఆఫ్ నేషనల్-2023 అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఎస్‌జేఎం దవాఖానను ఏర్పాటు చేసి కాస్మటాలజిస్ట్, ట్రైకాలజిస్ట్ (హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, సైకాలజీ వంటి విభిన్న రంగాల్లో దేశంలోని 5600 క్లినిక్‌లను ఆర్గనైజేషన్ పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో ఆయా విభాగాల్లో ఉత్తమ సేవలను అందించిన 35 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నదన్నారు.



## బాధ్యతల స్వీకరణ

ఆమనగల్లు : తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో గల రాష్ట్ర ఫుడ్ కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులతో కలిసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జిల్లాల మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అప్పుడు కన్నీళ్లు.. ఇప్పుడు సాగు, తాగునీరు

బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి

- బీఆర్ఎస్‌లో చేరికల జోరు
- ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని ఒక్క తాటిపై నడిపిస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్
- వికారాబాద్, కొడంగల్ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో పలు పార్టీల శ్రేణులు చేరిక



ధారూరు : ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

ధారూరు, అక్టోబర్ 1 : గత పాలనలో కన్నీళ్లు.. బీఆర్ఎస్ పాలనలో సాగు, తాగునీరు అందుతున్నదని.. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, మన పాలన మనమే చేసుకుందామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం ధారూరు మండల పరిధిలోని ధారూరు, ధారూరు స్టేషన్, దోర్నాల్, జీడిగడ్డతండా, మున్నూరు సోమారం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఎంపీటీసీ దస్తయ్య, రాములునాయక్, బావుసింగ్, తోట నర్సింహులు, రాములు, శ్రీనివాస్, గోపాల్, ఎల్లయ్య, అనంతయ్య, పాండు, బబ్లూ, వీరు, శ్రీను, లోకేశ్, నవీన్, వినోద్, రమేశ్, కృష్ణ, హుస్సేన్, వారి అనుచరులు 140 మంది ఉన్నారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ధారూరు మండల అధ్యక్షుడు రాజూనాయక్, ప్రధాన కార్యదర్శి రాజుగుప్తా, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటయ్య, లక్ష్మయ్య, రాములు, జైపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలూనాయక్, శ్రీనివాస్‌నాయక్, గోవింద్‌రాజ్‌గౌడ్, రవీందర్‌నాయక్, భీమ్‌సేన్‌రావు ఉన్నారు.

### బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమ పాలన

వికారాబాద్ : బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమవుతుందని వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ తెలిపారు. ఆదివారం వికారాబాద్ ఎమ్మెల్యే నివాసంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారంకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, వారి అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషితో గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఆసరా పింఛన్లు తదితర పథకాలతో దేశంలో నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇన్ని పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. పార్టీలో చేరినవారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాములు, ఖలీమ్, ఖాజా, సలీమ్ ఉన్నారు.

### ప్రతిపక్షాలతో విసిగి బీఆర్ఎస్ పార్టీలో చేరిక

కొడంగల్ : ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని ఒక్క తాటిపై నడిపిస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధి బొంరాస్‌పేట మండలంలోని కుబ్యానాయక్‌తండా, తెగలగడ్డతండాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు 330 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ. గడిచిన 9 సంవత్సరాల్లో తెలంగాణను దేశంలోనే నం.1 రాష్ట్రంగా నిలబెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీల నాయకులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అధికారాన్ని ఏ విధంగా దక్కించుకోవాలనే ప్రయత్నంలోనే ఉండిపోయే వారని.. తద్వారా అభివృద్ధి అమడ దూరంలో ఉండిపోయినట్లు తెలిపారు. దీర్ఘకాల పోరాటం సాగించి, ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తెలంగాణను అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలబెట్టినట్లు తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న వినూత్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఏండ్ల కాలంగా రోడ్డు ఎరుగని ఎన్నో గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లను మంజూరు చేసి, పనులు పూర్తి చేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. గిరిజనులకు అధికారాన్ని కట్టబెట్టి వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కృషి చేస్తుండటంతో గిరిజనులు బీఆర్ఎస్ పార్టీని గుండెకు హత్తుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### ప్రజల మధ్య ఉండే నాయకుడి కోసం..

పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ.. ఎక్కడో ఉండి చేతులు ఊపే రేవంత్‌రెడ్డిలాంటి నాయకుడు ప్రజలకు అవసరం లేదని, ప్రజల మధ్యన ఉండి ప్రజల భుజం తట్టే నాయకుడు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అటువంటి నాయకుడు ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అని, నిరంతరం ప్రజల మధ్యన ఉండి ప్రజా సమస్యలను స్వయంగా గుర్తించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డిని రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏ ఒక్కనాడూ మా బాధలను పట్టించుకోలేదని, ఏ ఒక్క తండాను కూడా సందర్శించిన దాఖలాలు లేవన్నారు. నరేందర్‌రెడ్డి పిలిస్తే పలికే నాయకుడని, కష్టాల్లో ఉన్న ప్రజలు, కార్యకర్తలకు అండగా నిలుస్తూ.. ఎప్పటికప్పుడు కష్ట, సుఖాలను తెలుసుకొని ఇంటి మనిషిలా కాపాడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంతో పాటు ప్రజల మధ్యన ఉండే పార్టీలో ఉంటే ఎంతో గౌరవం ఉంటుందని బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బొంరాస్‌పేట పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బొంరాస్‌పేట పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ కండువాతో స్వాగతిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

# యాసంగికి సమాయత్తం

- జిల్లాలో విత్తనాలు వేసే పనుల్లో రైతులు బిజీ
- వర్షాలు సమృద్ధిగా కురువడంతో బోర్లలో పుష్కలంగా నీళ్లు
- 1.30 లక్షల ఎకరాల్లో పంటలు వేసే అవకాశం



బొంరాస్‌పేటలో వేరుశనగ విత్తనాలను వేస్తున్న రైతులు

బొంరాస్‌పేట, అక్టోబర్ 1 : జిల్లాలో యాసంగి పనులకు రైతులు సమాయత్తమవుతున్నారు. వానకాలంలో సాగు చేసిన పంటలు చేతికి వచ్చిన తరువాత రైతులు తమ భూములను దున్నుకుని యాసంగి సీజన్‌కు సిద్ధమవనున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురువడంతో వ్యవసాయ బోర్లలో పుష్కలంగా నీళ్లున్నాయి. కొన్ని రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం మెట్ట భూముల్లో రైతులు వేరుశనగ, తెల్ల కుసుమ, కంది, మొక్కజొన్న, శనగ పంటలను సాగు చేస్తున్నారు. వరి చేతికి వచ్చిన తరువాత డిసెంబర్, జనవరిలో సాగు పనులు ప్రారంభమవుతాయి. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంచడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు విత్తనాలు వేసే పనులు కొనసాగిస్తున్నారు.

యాసంగి సీజన్‌లో జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసే అవకాశం ఉంది. యాసంగి సాగు విస్తీర్ణం 2021లో 1,04,528 ఎకరాలు., 2022లో 1,25,811 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. ఈ ఏడాది 1.30 లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు సాగు చేసే అవకాశం ఉంది. 2022లో యాసంగిలో వివిధ రకాల పంటల సాధారణ విస్తీర్ణాన్ని పరిశీలిస్తే వరి 32,179 ఎకరాలు, వేరుశనగ 11,623, శనగ 12,358, జొన్న 6147, మొక్కజొన్న 3774, నల్లకుసుమ 1364, చెరుకు 2500 ఎకరాలు, కంది 300, గోధుమలు 240, ఇతర పంటలు 11,515 ఎకరాల్లో సాగు చేశారు. ప్రతి ఏటా సాధారణ విస్తీర్ణానికి మించి రైతులు పంటలను సాగు చేస్తుంటారు.

### వరి, వేరుశనగ సాగు అధికం

యాసంగిలో రైతులు ఎక్కువగా వరి, వేరుశనగ పంటలను సాగు చేస్తారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురువడంతో జిల్లాలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయి. వీటి కింద ఎక్కువగా వరి పంటను సాగు చేస్తారు. జిల్లాలోనే అత్యధికంగా బొంరాస్‌పేట మండలంలో దాదాపు 16 వేల ఎకరాల్లో వరి పంట, 6500 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేయనున్నారు.

### అందుబాటులో ఎరువులు, విత్తనాలు

యాసంగి సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉంచింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జిల్లాలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఎంపిక చేసిన ఎరువుల డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు లభించనున్నాయి. ఎరువులు, విత్తనాల కొనుగోలుతో దుకాణాలు రైతులతో కిటకిటలాడుతున్నాయి.